

విద్యుత్ దీపాల అలంకరణలో మెదక్ చర్చి

# కరుణామయుడి మందిరం కళాత్మకం

## శిల్పకళలతో ఉట్టిపడుతున్న మెదక్ మహాదేవాలయం

మెదక్ (నమస్తే తెలంగాణ)/మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 24: మెదక్‌లోని చర్చి ఒక అమూల్యమైన చారిత్రక వారసత్వం. ఇది ఆసియా ఖండంలోకెల్లా అతి పెద్దదైన డయాసీసే కాకుండా వాటికన్ తర్వాత ప్రపంచంలోనే పెద్దది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో వచ్చిన కరువు సందర్భంగా ఈ చర్చిని నిర్మించారు. చార్లెస్ వాకర్ పోస్నెట్ అనే ఆయన అప్పట్లో ఫాదర్‌గా ఉండేవాడు. మూడేండ్ల పాటు పీడించిన కరువుకు చలించిన ఆయన 1914లో మెదక్ చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. కళాత్మకమైన మెదక్ చర్చి నిర్మాణం పూర్తి చేయడానికి పదేండ్లు పట్టింది. ఒకేసారి 5000 మంది ప్రార్థనలు చేసేలా అతిపెద్ద చర్చి ఇది.

### అది 1908 సంవత్సరం..

1908లో మెదక్ ప్రాంతంలో తీవ్ర కరువు వచ్చింది. వర్షాలు లేక పంటలు సాగుచేసే పరిస్థితి లేదు. పనులు లేక ఉపాధి కరువైంది. చేసేందుకు పనులు లేక, తినేందుకు తిండి కరువై వేలాది మంది ప్రజలు ఆకలి దప్పులతో అలమటించారు. ఈ పరిస్థితి చూసి ఫాదర్ ఫాస్నెట్ చలించారు. అన్నార్థులను ఆదుకోవాలని తలంచారు. ఏసు ప్రభువుకు పెద్ద ప్రార్థనా మందిరం నిర్మించాలన్న ఆలోచనలో ఉన్న ఫాస్నెట్ ఇటు కరుణామయుడికి ఆలయం నిర్మించడం.. అటు కరువు పీడితుల ఆకలి తీర్చడం లక్ష్యంగా చర్చి నిర్మాణానికి పూనుకున్నాడు. బర్మా నుంచి బియ్యం, ఆహార పదార్థాలు తెప్పించి పనికి ఆహారం ప్రతిపాదికన చర్చిని నిర్మించారు. 1910లో మొదలైన చర్చి నిర్మాణం 1924 వరకు కొనసాగింది. అంత కాలం ఎంతోమందికి చేతి నిండా పని దొరికింది.

### 173 అడుగుల ఎత్తు..


మెదక్ చర్చిని 180 అడుగుల ఎత్తుతో నిర్మించాలని ఫాదర్ ఫాస్నెట్ తలంచి అనుమతి కోసం నిజాం ప్రభువుకు దరఖాస్తు సమర్పించారు. నిజాం రాజ చిహ్నంగా ఉన్న హైదరాబాద్‌లోని చార్మినార్ ఎత్తు 175 అడుగులు కాగా, అంతకంటే ఎక్కువ ఎత్తులో చర్చి నిర్మించేందుకు అనుమతించలేదు. దీంతో 173 అడుగుల ఎత్తుతో చర్చి నిర్మించేందుకు ఫాస్నెట్ నిర్ణయించారు. చర్చి ప్రధాన గోపురం ఎత్తు 173 అడుగులు కాగా, వెడల్పు 100 అడుగులు, పొడువు 200 అడుగులు ఉంది. మెదక్ చర్చిని పూర్తిగా రాతితో డంగుసున్నం వినియోగించి ఎంతో పటిష్టంగా నిర్మించారు.

### అద్దాల కిటికీల్లో క్రీస్తు జన్మ వృత్తాంతం

మెదక్ చర్చి నిర్మాణంలో నేటి ఇంజినీర్ల ఊహకందని నిర్మాణ నైపుణ్యాలు ఒక ప్రత్యేకత అయితే, అద్దాల కిటికీలు మరో ప్రత్యేకత. క్రీస్తు జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఎంతో కళాత్మకంగా కండ్లకు కట్టేలా అద్దాల కిటికీల్లో పొందుపర్చడం విశేషం. ఇంగ్లాండ్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు 'ఓ సాలిస్ బరి స్టెయిన్' గ్లాస్ ముక్కలతో ఈ కిటికీలకు రూపకల్పన చేశారు. మూడు దశల్లో వీటిని ఏర్పాటు చేశారు. ముందుగా 1927లో చర్చిలో ఎదురుగా ఉన్న వేదికపై ఉన్న కిటికీ అద్దాల్లో క్రీస్తు ఆరోహణకు సంబంధించిన దృశ్యాలు పొందుపర్చారు. ఆ తర్వాత 1947లో చర్చిలో కుడివైపున ఉన్న కిటికీ అద్దాల్లో ఏసు ప్రభువు జననానికి సంబంధించిన దృశ్యాలు, 1958లో క్రీస్తు శిలువపై వేలాడుతున్న దృశ్యాలు పొందుపర్చారు. బయటి నుంచి సూర్యకాంతి ప్రసరించినప్పుడు మాత్రమే చర్చిలోపల నుంచి చూస్తే కిటికీ అద్దాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు కనిపించడం వీటి ప్రత్యేకత.

### కళాత్మకం.. ప్రార్థనా మందిరం..

ఆసియా ఖండంలో రెండో అతిపెద్ద చర్చిని మెదక్ పట్టణంలో అద్భుతమైన నైపుణ్యంతో నిర్మించారు. ఏసుక్రీస్తు కొలువైన మహాదేవాలయంగా పేరొందిన ఈ చర్చి సందర్శనకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. మెదక్ జిల్లాకు తలమానికంగా బాసిల్లుతున్న మహాద్భుత కట్టడం మెదక్ కెథడ్రిల్ చర్చి. ఇది కల్లోల జగతికి శాంతి సందేశాన్ని అందించిన కరుణామయుడి మందిరమే కాదు.. అన్నార్థులను ఆదుకునే మహోన్నత ఆశయంతో రూపుదిద్దుకొన్న మహాదేవాలయం. కరువు నుంచి ఉద్భవించిన కళాత్మక కట్టడం. సుందరమైన మెదక్ చర్చికి ఘనమైన చరిత్ర ఉంది. కరుణామయుడి మందిరంలో ఆర్చీలు, పైకప్పు, ఫ్లోరింగ్ మాత్రమే కాదు.. వేదికపై టేబుళ్లు, కుర్చీలు సైతం ఎంతో కళాత్మకంగా ఉంటాయి. ప్రధాన వేదికపై ఉండే ప్రభు భోజనపు టేబుల్ రంగూన్ టేకుతో కళాత్మకంగా తయారు చేయబడింది. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ పఠన వేదిక దేవదారు కర్రతో పక్షిరాజు రూపంలో ఎంతో అద్భుతంగా మలచారు. జెకొస్లోవేకియా దేశానికి చెందిన కలప పనివారు చాలారోజుల పాటు శ్రమించి దీనిని అసలైన పక్షిని తలపించేలా రూపొందించడం వారి పతనానికి నిదర్శనం. గురువులు ఆసీనులయ్యే బల్లలు, కుర్చీలు గులాబీ కర్రతో తయారు చేశారు.




## ప్రశాంతతకు నిలయం..

ఆహ్లాదకర వాతావరణంలో మత సామరస్యానికి, ప్రశాంతతకు ప్రతీకగా నిలిచింది మెదక్ చర్చి. ఈ చర్చిని ఇంగ్లాండ్‌లోని రన్‌కోల్ పట్టణానికి చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్ నిర్మించారు. ఈ చర్చి నిర్మాణానికి ఆయన టోపీ పట్టుకుని ఇంగ్లాండ్‌లోని అన్ని ప్రాంతాలు తిరుగుతూ విరాళాలు వసూలు చేస్తుంటే, ఇంగ్లాండ్ దేశస్తులు ఇండియా ఫకీర్ అని, హైదరాబాద్ బిచ్చగాడని వేళాకోలం చేసేవారని చెబుతుంటారు. కేథడ్రల్ నిర్మాణం 1914లో ప్రారంభమై 1924లో పూర్తయింది. యూరప్‌నకు చెందిన గాథిక్ శైలిలో ఈ మహాలయం నిర్మించబడింది. దక్షిణ, తూర్పు ఆసియా ఖండం నందు ఈ కేథడ్రల్ చర్చి మహోన్నతమైందిగా పేరుగాంచింది. ఈ మహా దేవాలయం శిఖరం ఎత్తు 173 అడుగులు. ఈ దేవాలయం పొడవు 200 అడుగులు, వెడల్పు 100 అడుగులు. ఆ కాలంలోనే రూ.32 లక్షల వ్యయం అయినట్లు అంచనా. 360 ఎకరాల విస్తీర్ణంలో ప్రహరీ మధ్యలో చర్చిని నిర్మించారు. చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) పరిధిలో మొత్తం 22 డయాసిస్‌లు ఉన్నాయి. అందులో మెదక్ డయాసిస్ ఒకటి. 1947 సెప్టెంబర్ 30న ఇది ఆవిర్భవించింది. దీని పరిధిలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు ఉన్నాయి. ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మెదక్ బిషప్‌లుగా తొమ్మిది మంది చేశారు.


మెదక్ చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శాంతాక్లాజ్


ఆదివారం చర్చి ప్రాంగణంలో తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్ బృందం

## 535 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు


### మెదక్ అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్

మెదక్ అర్బన్, డిసెంబర్ 24: మెదక్‌లోని చర్చిలో క్రిస్మస్‌కు భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మెదక్ చర్చికి భారీగా భక్తులు తరలి వస్తారని, జాతరలో ఆటంకం కలుగకుండా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 4 సెక్టార్లు ఏర్పాటు చేసి అదనపు ఎస్పీ పర్యవేక్షణలో నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీలు 3, సీఐలు, ఆర్ఐలు, ఎస్సై, ఆర్ఎస్సైలు, ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్లు, 175 మంది కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీలు క్రైమ్ టీమ్, షీ టీమ్స్, ఏఆర్ సిబ్బది కలిపి మొత్తం 535 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరలో చిన్న పిల్లలు తప్పిపోతే చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్‌లో వారి వివరాలు తెలుపాలన్నారు. భద్రతలో భాగంగా బాంబ్ డిస్పోజబుల్ టీం, డాగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ రంగా నాయక్, తూప్రాన్ సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, జిల్లా ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.


మెదక్ చర్చి ఆవరణలో రంగుల రాట్నాలు

## ఆరాధనలు.. ఉత్సవాలు

1924 డిసెంబర్ 25న క్రిస్మస్ రోజు మెదక్ మహాదేవాలయాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఆనాటి నుంచి ప్రతి ఏడాది క్రిస్మస్ సందర్భంగా ఈ చర్చిలో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 99వ క్రిస్మస్ వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకలు సోమవారం తెల్లవారుజాము నుంచి నిర్వహించనున్నారు. విద్యుద్దీపాలతో చర్చి కాంతులు విరజిమ్ముతున్నది.


ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, భక్తులనుద్దేశించి దైవ సందేశం చేస్తున్న ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య

## భక్తులతో కిక్కిరిసిన మెదక్ చర్చి

మెదక్ చర్చి భక్తులతో కిక్కిరిసిపోయింది. క్రిస్మస్ ముందు ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్, సువర్ణ, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, జాన్సన్, గెలెన్ చిత్తరంజన్, జాయ్ ముర్రే తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి